క్లుప్తంగా

వాసవీమాతకు ప్రత్యేక పూజలు



మక్తల్: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాడమాసం సందర్భంగా అమ్మ వారిని కూరగాయలతో అలంకరించి పూజలు చేశారు. ప్రతి ఏడాది ఆషాడమాసంలో అమ్మ వారిని కూరగాయలతో అలంకరించి పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నదని ఆర్యవైశ్య సంఘం సభ్యులు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి



మరికల్: పార్లమెంట్ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సింగిరెడ్డి పరమేశ్వర్ అన్నారు. మరికల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేయాలని కొన్నేళ్లుగా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న పట్టించుకోవడం లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై కాలయాపన చేస్తే వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామన్నారు. సమావేశంలో బాలరాజు, రామస్వామి, బాలకృష్ణ, వెంకటయ్య, మాసప్ప, మొగులప్ప ఉన్నారు.

ఘనంగా మెహందీ వేడుక



కోస్గి: మండలంలోని ముశ్రీఫా ఉన్నత పాఠశాలలో శుక్రవారం మెహందీ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీవశాస్త్ర ఉపాధ్యాయుడు వార్ల మల్లేశం ఆధ్వర్యంలో సంప్రదాయంలో సైన్స్ అనే అంశంపై అవగాహన కల్పించారు. వానాకాలంలో గోరింటాకు కాళ్లు, చేతులకు పూసుకోవడం వల్ల పలు వ్యాధులు దరి చేరవని తెలిపారు. ఆషాడ మాసంలో మహిళలు గోరింటాకు పూసుకోవడం ఆచారంగా మారిందన్నారు. జీవశాస్త్ర పాఠ్యాంశాలకు సంబంధించిన మైటోకాండ్రియా, అమీబా, నాడీ కణం, స్త్రీ, పురుష ప్రత్యుత్పత్తి వ్యవస్థ, పుష్పంలోని భాగాలు తదితర చిత్రాలను విద్యార్థులు గోరింటాకుతో వేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి అభినందన



మరికల్: ఇటీవల పంజాబ్‌లో నిర్వహించిన జాతీయస్థాయి కిక్‌బాక్సింగ్ టోర్నీలో మరికల్‌కు చెందిన అనూష ప్రతిభకనబర్చి కాంస్య పతకం సాధించింది. శుక్రవారం మల్లికార్జున కురువ సంఘం ఆధ్వర్యంలో అనూషను ఘనంగా సన్మానించి అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని క్రీడా పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పెద్ద లక్ష్మయ్య, సతీష్, మల్లేష్, యాదయ్య, వెంకటేష్, రవి, కాట్టెప్ప, ఆశన్న, హన్మంతు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీపై అవగాహన



ఊట్కూరు: ఆల్బెండజోల్ మాత్రల పంపిణీపై శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలకు డాక్టర్ సాయిరాం అవగాహన కల్పించారు. ఈనెల 20నుంచి 19 సంవత్సరాలలోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మణిమాల, సురేష్, సుజాత, కవిత, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

మరికల్: కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన వారు రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏఓ శివకుమార్, ఏఈఓ పరశురాం శుక్రవారం ప్రకటనలో కోరారు. రైతుబీమా జాబితాలో ఉన్న రైతులు ఆగస్టు 5వ తేదీలోగా పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్, నామినీ ఆధార్ జిరాక్స్‌తో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మిన్నంటిన సంబురం



జాజాపూర్ ఉన్నత పాఠశాలలో అంతరిక్ష ప్రయోగాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు

- చంద్రయాన్–3 విజయవంతంపై సర్వత్రా హర్షం
- పాఠశాలల్లో ప్రొజెక్టర్ ద్వారా వీక్షించిన విద్యార్థులు
- మిఠాయిల పంపిణీ

నారాయణపేట రూరల్: చంద్రాయన్–3 విజయవంతం కావడంపై సర్వత్రా హర్షం వ్యక్త మైంది. శుక్రవారం పలు పాఠశాలల్లో విద్యార్థులు మిఠాయిలు పంచుకొని సంబురాలు నిర్వహించారు. నారాయణపేట మండలంలోని జాజాపూర్ ఉన్నత పాఠశాల, స్థానిక శ్రీహంసవాహిని, శ్రీసా యి పాఠశాలల విద్యార్థులు చంద్రాయన్–3 ప్రయో గాన్ని ప్రొజెక్టర్ ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా డీఎస్‌ఓ భానుప్రకాష్, సైన్స్ ఫోరం కన్వీనర్ కనకప్ప మాట్లాడుతూ అంతరిక్ష చరిత్రలో భారత పతాకం మరోసారి రెపరెపలాడిందని, ప్రయోగం విజయవంతం కావడంపై ఆనందం వ్యక్తం చేశారు. ప్రత్యక్ష వీక్షణతో విద్యార్థులకు సైన్స్‌పై అభిరుచి పెంచుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాధవి, విజయ్, మధుసూదన్‌రావు, రాజేష్‌కుమార్, ఆనంద్, తిరుపతి, నర్సింహులు, సుజాత, సాయిలీల, బాలప్ప, నర్సింహ పాల్గొన్నారు.

కోస్గి: చంద్రయాన్–3 విజయవంతం కావడంతో మండలంలోని మీర్జాపూర్ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సంబురాలు నిర్వహించారు. చంద్రయాన్–3 ఆకారంలో విద్యార్థులు కూర్చొని ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనంతప్ప, ఉపాధ్యాయులు భానుప్రకాష్, సిద్ధిరాములు, వినోజ్, భీమయ్య, వీరేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని చిన్నపొర్ల పాఠశాలలో చంద్రయాన్–3పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చంద్రయాన్–3 నమూనాను తయారు చేసి ప్రదర్శించారు. చంద్రయాన్–3 విజయవంతం కావడంతో ఒకరినొకరు మిఠాయిలు పంచుకొని సంబురాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు జగన్నాథ్‌రావు, రాయల్ హన్నా, నర్సింహ, కృష్ణమ్మ, భాస్కర్, శ్రీధర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మీర్జాపూర్ పాఠశాలలో చంద్రయాన్–3 ఆకారంలో కూర్చున్న విద్యార్థులు



చిన్నపొర్ల పాఠశాలలో..

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట



కొత్తపల్లిలో పంచాయతీ భవవ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ఊట్కూరు: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసి నిధులను కేటాయిస్తున్నదని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని తిప్రాస్‌పల్లి, కొత్తపల్లి, మల్లేపల్లి, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో శుక్రవారం పంచాయతీ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. తిప్రాస్‌పల్లి నుంచి బాపూర్ వరకు నిర్మించిన బీటీరోడ్డును ప్రారంభించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో తిప్రాస్‌పల్లి గ్రామ రైతులకు ఉచితంగా కంది విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. హరితహారం, పల్లెప్రగతి కార్యక్రమాలతో ప్రతి గ్రామంలో పచ్చదనం, పరిశుభ్రత పెరిగిందన్నారు. సీసీరోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి భారీగా నిధులు మంజూరైనట్లు తెలిపారు. పంచాయతీ భవన నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్కోటి లక్ష్మి, జెడ్పీటీసీ అశోక్‌కుమార్, సింగిల్‌విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ అరవింద్‌కుమార్, సర్పంచులు సుమంగళి, మాణిక్యమ్మ, శాంతమ్మ, ఎంపీడీఓ కాలప్ప, నాయకులు లక్ష్మారెడ్డి, సుధాకర్‌రెడ్డి, విజయసింహారెడ్డి, ఎల్లాగౌడ్, సూర్యప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణపై అలసత్వం వద్దు

నారాయణపేట రూరల్: హాస్టళ్ల వార్డెన్లు విధి నిర్వహణపై అలసత్వం వద్దని బీసీ వెల్ఫేర్ అధికారి కృష్ణమాచారి అన్నారు. పట్టణంలోని బీసీ బాలుర, బాలికల వసతిగృహాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వార్డెన్లు విద్యార్థులకు అందుబాటులో ఉండి ఏ సమస్య ఏర్పడకుండా చూడాలన్నారు. వానాకాలం దృష్ట్యా పరిసరాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. మెనూ అమలులో మార్పు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా వార్డెన్లు మసూద్, మంజుల ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కృష్ణమాచారి

ధర్నాను జయప్రదం చేయాలి

దామరగిద్ద: వడ్డీ లేని రుణాల మంజూరుపై ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు శనివారం డ్వాక్రా మహిళలు చేపట్టిన ధర్నాను జయప్రదం చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కన్వీనర్ గోవిందమ్మ కోరారు. ఘండల కేంద్రంలో శుక్రవారం ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బంగారు తెలంగాణలో మహిళలకు వడ్డీ లేని రుణాలు, పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని ఆశపడామని తెలిపారు. తెలంగాణ వచ్చాక కేసీఆర్ ఇంటికే ఉద్యోగాలు వచ్చాయని విమర్శించారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాలో మహిళలు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో గోపాల్, అంజిలయ్య, రాములమ్మ, వెంకటమ్మ, లక్ష్మి, యశోద పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న మహిళా సంఘాల సభ్యులు

కలెక్టరేట్ ముట్టడికి తరలిన కార్మికులు



మద్దూరు నుంచి కలెక్టరేట్ ముట్టడికి బయలుదేరుతున్న కార్మికులు



కృష్ణా నుంచి..

మద్దూరు: పంచాయతీ కార్మికులు శుక్రవారం కలెక్టరేట్ ముట్టడికి తరలివెళ్లారు. సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేపట్టినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ ముట్టడికి బయలుదేరారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. కార్మికుల సమ్మెతో గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తున్నదని, ప్రభుత్వం స్పందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాపంథ నాయకుడు నర్సింహులు, మహిపాల్, భీములు, ఆంజనేయులు, వెంకటేష్, రాములు, మొగులప్ప పాల్గొన్నారు.

కృష్ణా: పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు ఏజీ బుట్టో కోరారు. మండల కేంద్రం నుంచి కలెక్టరేట్ ముట్టడికి కార్మికులు బయలుదేరారు. సమస్యలను పరిష్కరించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని తెలిపారు.

మండలం చేసే వరకు పోరాటం



దీక్ష శిబిరంలో కూర్చున్న మహిళలు

నారాయణపేట రూరల్ : కోటకొండను మండలం చేసేవరకు పోరాటం కొనసాగిస్తామని మండల సాధన సమితి సభ్యులు తెలిపారు. కోటకొండను మండల కేంద్రం చేయాలని డిమాండ్ చేపట్టిన రిలే నిరాహారదీక్ష శుక్రవారం 66వ రోజుకు చేరింది. మహిళా సంఘం సభ్యులు దీక్ష చేపట్టగా, సాధన సమితి సభ్యులు పూలమాల వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ వచ్చాక పరిపాలనా సౌలభ్యం కోసం జిల్లాలు, మండలాలు ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం.. అన్ని అర్హతలు ఉన్న కోటకొండను విస్మరించడం తగదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కోటకొండను మండల కేంద్రం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచు విజయలక్ష్మి, సౌజన్య, శ్రీనివాసులు, రాము, యాదగిరి, కాశీనాథ్, చెన్నప్ప, సలీం పాల్గొన్నారు.

ఎస్టీయూటీఎస్ సభ్యత్వ నమోదు

మక్తల్: ఎస్టీయూ టీఎస్ సభ్యత్వ నమోదును ముమ్మరం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాంగోపాల్ కోరారు. మక్తల్ పట్టణంలో శుక్రవారం ఎస్టీయూ టీఎస్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వాలు అత్యధికంగా నమోదు చేయించి యూనియన్‌ను మరింత బలోపేతం చేయాలని సభ్యులకు సూచించారు. సమావేశంలో కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, దత్తురావు, శ్రీనివాస్, బాల్‌రాజ్ ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



కృష్ణా: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పోలీసు కళాజాత బృందం సూచించింది. మండలంలోని చేగుంటలో శుక్రవారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ సురేందర్‌బాబు మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలపై ఎప్పటికప్పుడు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలకు గురైతే టోల్‌ఫ్రీ నెంబర్ 1930 లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామంలో దొంగతనాలు జరగకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శివప్ప, సిబ్బంది సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, కల్యాణి, రూక్యానాయక్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన సలీం



మద్దూరు: రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ డైరెక్టర్ మహ్మద్ సలీం శుక్రవారం హైదరాబాద్‌లో ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావును కలిశారు. తన ఎంపికకు కృషి చేసిన మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, కోస్గి మాజీ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు నర్సింహులు, అశోక్ తదితరులు ఉన్నారు.

ఎల్‌ఐసీ కార్యాలయ వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న బ్రాంచ్ మేనేజర్ రమేష్

నారాయణపేట రూరల్: పట్టణంలో ఎల్‌ఐసీ కార్యాలయం ప్రారంభించి 15 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం సంబురాలు నిర్వహించారు. బ్రాంచ్ మేనేజర్ రమేష్ కేక్ కట్ చేయగా, ఎల్‌ఐసీ ఏజెంట్లు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ఎంతోమంది పాలసీదారులకు సేవలు అందించడంతోపాటు ఆపదలో ఆదుకుంటున్నట్లు తెలిపారు. ఏజెంట్ల కృషి, పాలసీదారుల నమ్మకంతో అభివృద్ధి పథంలో పయనిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కాశీనాథ్, తేజ, శ్యాంసుందర్, దినేష్ లాహోటీ, వెంకటేష్, లక్ష్మీకాంత్, ఆనంద్, జగదీష్, నసీర్ పాల్గొన్నారు.

నోట్‌పుస్తకాల పంపిణీ

నారాయణపేట రూరల్: సినీ నటుడు తనికెళ్ల భరణి జన్మదిన వేడుకలను శుక్రవారం పట్టణంలోని రాక్‌స్టార్ నృత్య శిక్షణ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ బాలు ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి చిన్నారులకు నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, నర్సింహులు, వసంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



చిన్నారులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్న నాయకులు

విద్యావ్యవస్థపై నిర్లక్ష్యం తగదు



మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

నారాయణపేట రూరల్: విద్యావ్యవస్థపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఇంతియాజ్ అన్నారు. పట్టణంలోని సత్యనారాయణ చౌరస్తాలో విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహించారు. అంతకుముందు పురవీధుల గుండా నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులను ప్రోత్సహిస్తూ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ప్రభుత్వ విధానాలతో పేద, మధ్యతరగతి విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ పూర్తిస్థాయిలో అందించాలని, ఉపాధ్యాయ, స్కావింజర్ల పోస్టులను భర్తీ చేయడంతోపాటు పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటులో అధిక ఫీజులను నియంత్రించి పుస్తకాలు అమ్మకుండా చర్యలు చేపట్టాలన్నారు. చరణ్, వెంకటరమణ, ఆకాష్, సతీష్, వెంకటేష్, వరుణ్, సాయి, రాంరెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

మక్తల్: కారు, బైక్ ఢీకొని ఇద్దరు యువకులకు గాయాలైన ఘటన శుక్రవారం రాత్రి 8గంటలకు ఉప్పరిపల్లి స్టేజీ వద్ద చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మక్తల్ నుంచి నవీన్, రాజులు బైక్‌పై సోమేశ్వరబండ గ్రామానికి వెళ్తుండగా ఉప్పరిపల్లి స్టేజీ వద్ద నారాయణపేట నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు వారి కుటుంబాలకు సమాచారం అందించి చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

మరికల్: పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి అన్నారు. మండలంలోని చిత్తనూర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఆరోగ్యలక్ష్మి పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం ఆరోగ్య లక్ష్మి పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈదమ్మ బోనాలు


కోస్గి: ఆషాడమాసం సందర్భంగా కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఈదమ్మ బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కుమ్మరివాడలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఈదమ్మ ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కుమ్మరి సంఘం సభ్యులు పాల్గొన్నారు.



బోనాలతో ఈదమ్మ ఆలయానికి వెళ్తున్న భక్తులు

పత్తి పొలం గొర్రెల పాలు

మాగనూర్: ఇప్పటి వరకు అనుకున్న స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు వేసిన పంటలు గొర్రెలకు వదిలేస్తున్నారు. ఈ సంఘటన మండలంలోని గురువలింగంపల్లిలో కనిపించింది. గ్రామానికి చెందిన వాబయ్య తన వ్యవసాయ పొలంలో దాదాపు ఆరు ఎకరాల్లో పత్తి విత్తనాలు వేశాడు. అయితే మొదట కురిసిన వర్షాలతో మొక్కల స్థాయికి రాగా.. సరైన సమయంలో వర్షాలు లేక అవి గిడసబారి వాడిపోతున్నాయి. దీంతో గమనించిన సదరు రైతు చేసిదిఏమిలేక శుక్రవారం మొత్తం పత్తి మొక్కలను గొర్రెలకు మేపడం కోసం వదిలిపెట్టాడు. ఇప్పటి వరకు దాదాపుగా రూ.30 వేలకు పైగా ఖర్చు చేశానని వాపోయాడు.



పత్తిపొలంలో మేస్తున్న గొర్రెలు